క్లుప్తంగా

'ఎన్‌సీఎస్'పై రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న వెంకటరావు తదితరులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ రైతుబజార్‌లో మంగళవారం నేషనల్ కెరీర్ సర్వీస్(ఎన్‌సీఎస్) రిజిస్ట్రేషన్‌పై సంస్థ ప్రతినిధులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఎన్‌సీఎస్ ప్రొగ్రాం విశాఖపట్నం ప్రాంతీయ కార్యాలయం ఇన్‌చార్జి బి.వెంకటరావు మాట్లాడుతూ మినిస్ట్రీ ఆఫ్ లేబర్ అండ్ ఎంపవర్‌మెంట్ ఎన్‌సీఎస్ ప్రోగ్రాం ద్వారా కేంద్ర ప్రభుత్వం అనేక ప్రయోజనాలను అందుబాటులో ఉంచిందన్నారు. ఎంప్లాయిమెంట్, డెవలప్‌మెంట్ ఆపర్చ్యునిటీస్, హెల్త్ కార్డులు, ఈ శ్రమ కార్డులు వంటి సౌకర్యాలు అందిస్తుందని తెలిపారు. వాటిని నిరుద్యోగులు, రైతులు వినియోగించుకోవాలని కోరారు. ఎంవీపీ రైతుబజార్‌కు చెందిన 90 మంది రైతులకు హెల్త్, ఈ శ్రమ కార్డులు అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పెందుర్తి వినియోగదారుల సేవా సంఘం అధ్యక్షుడు ఎ.దేముడు బాబు, రైతుబజార్ ఈవో వరహాలు తదితరులు పాల్గొన్నారు.

'దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం'



కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బయ్య

మహారాణిపేట: దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గరికిముక్కు సుబ్బయ్య తెలిపారు. కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బయ్య 1950 రాష్ట్రపతి ప్రకటన మూడో క్లాజు వివరణలో హిందూమతంలోని సామాజిక వివక్షతకు, అంటరానితనానికి, అవమానాలకు గురైన వారిని ఎస్సీలుగా పరిగణించబడతారని స్పష్టంగా ఉందన్నారు. దళిత క్రైస్తవులను షెడ్యూల్ కులాలలో చేరిస్తే దాని పరిణామం దళిత హిందూ దళిత సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని, వారి అభ్యున్నతికి ఆటంకం ఏర్పడుతుందని తెలిపారు. అలాంటి వారి వల్ల నిజమైన ఎస్సీ లబ్ధిదారులు రాజ్యాంగ ఫలాలు పొందలేకపోతున్నారని, మతం మార్చుకున్న వారిని ఎస్సీ కుల జాబితా నుంచి తొలగించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో వేదిక విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి కటారి శంకరావు, జిల్లా ఉపాధ్యక్షుడు చొక్కాకుల రాంబాబు, విజయనగరం జిల్లా అధ్యక్షుడు పల్లికల శ్రీనివాసరావు, కటారి రమేష్, దశమంతుల సుశీల, జి రమా, శ్రీనివాసరావ, నరసింహ, కనకరాజు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ' పోస్టర్ ఆవిష్కరణ

సీతమ్మధార: భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 28న చలో ఢిల్లీ కార్యక్రమంలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ పిలుపునిచ్చారు. మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చలో ఢిల్లీ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం 1996ను అమలు చేయడంలో వివిధ రాష్ట్రాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు.. అధికారం చేపట్టిన 9 నెలలైనా ఎటువంటి ప్రకటన చేయకపోవడం దారుణమన్నారు. భవ నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని గాలికొదిలేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కోటా సత్తిబాబు, నాయకులు కూన కృష్ణారావు, మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి నవ రచయితల శిబిరం

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ కేంద్రీయ హిందీ దేశాలయం, న్యూఢిల్లీ సౌజన్యంతో హిందీ విభాగ ఆధ్వర్యంలో 8 రోజుల నవ రచయిత శిబిర నిర్వహిస్తున్నట్లు కాలేజీ కన్వీనర్ డాక్టర్ పి.కె. జయలక్ష్మి తెలిపారు. కళాశాల సెమినార్ హాల్‌లో మంగళవారం శిబిరం పోస్టర్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ ఆవిష్కరించారు. ఈ నెల 21 నుంచి 28 వరకు హిందీయేతర విద్యార్థులకు హిందీ నవ లేఖకుల శిబిరం నిర్వహిస్తున్నామన్నారు.

ఫ్లైఓవర్ కలేనా..!



హనుమంతవాక జంక్షన్ నుంచి నగరంలోకి ప్రయాణిస్తున్న వాహనాలు



హనుమంతవాక కూడలి నుంచి ఆరిలోవ, సింహాచలం వైపు బారులు తీరిన వాహనాలు



డెయిరీఫారం, విశాలాక్షినగర్ నుంచి కూడలి వైపు వస్తున్న వాహనాలు

హైవేపై హనుమంతవాక కూడలిలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్

- ఈ జంక్షన్ మీదుగా వేల సంఖ్యలో వాహనాల రాకపోకలు
- నిత్యం ట్రాఫిక్ గందరగోళం
- ప్రజల విజ్ఞప్తిని పట్టించుకోని పాలకులు



ఆరిలోవ: జాతీయ రహదారిపై హనుమంతవాక కూడలి వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని నగరవాసులు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారు. పాలకులు పట్టించుకోకపోవడంతో వీరి కల ఎప్పటికి నెరవేరుతుందో ప్రశ్నార్థకంగా మారింది. ఇక్కడ వాహనాలు రద్దీ రోజురోజుకూ పెరుగుతున్నా, ప్రభుత్వాలు మారుతున్నా ఫ్లైఓవర్ నిర్మాణంపై పాలకులు, అధికారులు ఎలాంటి చర్యలు ఇంత వరకు చేపట్టలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నుంచి ఇక్కడ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ వచ్చినా.. దీని ప్రతిపాదనలను అధికారులు మరుగునపడేశారు. దీంతో మళ్లీ దాని ఊసే లేకుండా పోయింది. హనుమంతవాక జంక్షన్‌లో ఫ్లైఓవర్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ఇందులో భాగంగా ధర్నాలు, నిరసనలు చేపడుతున్నారు. వారం కిందట విశాఖపట్నం అపార్ట్‌మెంట్ రెసిడెన్స్ అసోసియేషన్, గ్రేటర్ విశాఖ రెసిడెంట్ కాలనీ అసోసియేషన్స్(వార్వా నివాస్) ఆధ్వర్యంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ ధర్నా చేసిన విషయం తెలిసిందే.

బిజీ.. గజిబిజి

హనుమంతవాక జంక్షన్ నిత్యం వాహనాల రాకపోకలతో బిజీగా.. గజిబిజీగా ఉంటుంది. రెండేళ్లుగా ఈ రద్దీ మరింత పెరిగింది. ఈ రహదారిలో ప్రయాణించే వాహనాల సంఖ్య పెరగడమే ఇక్కడ రద్దీకి కారణమని ట్రాఫిక్ పోలీసులు అంటున్నారు.

- శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి జాతీయ రహదారి మీదుగా నగరానికి ఆర్టీసీ బస్‌లు, ట్రావెల్స్ బస్‌లు, పాఠశాలలు, కళాశాలల బస్‌లు, కార్లు, ఆటోలు నిరంతరం తిరుగుతుంటాయి.
- ఒడిశా నుంచి లారీలు, కార్లు ఇటుగా ప్రయాణిస్తుంటాయి.
- హనుమంతవాక నుంచి అడవివరం వరకు బీఆర్‌టీఎస్ రోడ్డు నిర్మించడంతో గోపాలపట్నం, పెందుర్తి, సింహాచలం, వేపగుంట ప్రాంతాల నుంచి నగరానికి వెళ్లేవారు ఈ కూడలి మీదుగానే ప్రయాణిస్తున్నారు.
- రుషికొండ, కైలాసగిరి నుంచి విశాలాక్షినగర్ మీదుగా హనుమంతవాక వైపు ద్విచక్ర వాహన చోదకులు వస్తుంటారు.
- ఆరిలోవ, ఆదర్శనగర్, డెయిరీఫారం ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వాహన చోదకులు తిరుగుతుంటారు. ఆయా మార్గాల ద్వారా తిరిగే వాహన చోదకులుతో నిత్యం ఈ కూడలి రద్దీగా మారుతుంది.



ఫ్లైఓవర్ నిర్మించాలని కోరుతూ ధర్నా చేసిన వార్వా నివాస్ ప్రతినిధులు(ఫైల్)

- ప్రధాన రహదారిపై ఉదయం 7.30 నుంచి రాత్రి 9 గంటలు వరకు హనుమంతవాక కూడలి నుంచి ఇటు వెంకోజిపాలెం వరకు, అటు డెయిరీఫారం వరకు వాహనాలు బారులు తీరుతున్నాయి.
- ఉదయం సమయంలో ఈ కూడలి నుంచి బీఆర్‌టీఎస్ రోడ్డులో ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి దాటి విమ్స్ వెనుక ద్వారం వరకు వాహనాలు నిలిచిపోతున్నాయి. ఆయా లైన్‌ల నుంచి హనుమంతవాక జంక్షన్ దాటడానికి వాహన చోదకులకు కనీసం రెండు మూడు సిగ్నళ్లు పడుతున్నాయి.

తరచూ రోడ్డు ప్రమాదాలు

హనుమంతవాక కూడలిలో రోడ్డు ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయి. రోడ్డు దాటుతున్న పాదచారులను వాహనాలు ఢీకొనడం, ముందు, వెనుక వెళ్లే వాహనాలు ఢీకొట్టకోవడం వంటివి జరుగుతున్నాయి. ఐదేళ్ల కిందట మధురవాడ వైపు నుంచి వస్తూ సిగ్నల్ పడటంతో ఆగి ఉన్న ఆటో, ద్విచక్ర వాహనాలపైకి ఒడిశా నుంచి వస్తున్న లారీ దూసుకుపోవడంతో నలుగురు సంఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిశారు. గతేడాది ఆర్టీసీ బస్ దూసుకుపోయి ఇద్దరు ద్విచక్ర వాహన చోదకులు మృతి చెందారు. 2023 డిసెంబర్ 31 రాత్రి 11 గంటల సమయంలో రోడ్డు దాటుతున్న ఓ యువతిని లారీ ఢీకొనడంతో మృతి చెందింది. ఇటీవల అర్ధరాత్రి సమయంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరిని లారీ ఢీకొనడంతో వెనుక కూర్చున్న వ్యక్తి మరణించాడు. ఈ జంక్షన్‌లో 10 ఏళ్లలో సుమారు 15 మందికి పైగా మృతి చెందారని, ఎందరో గాయాల పాలయ్యారని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. ఇక్కడ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మిస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని, ట్రాఫిక్ కష్టాలన్నీ తీరుతాయని, ఆ దిశగా పాలకులు, అధికారులు చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ సమస్యలు తీరుతాయి



ప్రతి రోజూ హనుమంతువాక కూడలి వాహనాలతో రద్దీగా ఉంటుంది. ప్రయాణికులు బస్‌లు, ఆటోలు దిగి రోడ్డు దాటాలన్నా కొంత సమయం పడుతుంది. ఒక్కోసారి ప్రమాదానికి గురవుతున్నారు. రోజూ ఆరిలోవ నుంచి నగరంలో పనిచేస్తున్న కార్యాలయాలకు వెళ్లేవారు హనుమంతవాక కూలిలో ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నారు. కూడలిలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మిస్తే ట్రాఫిక్ సమస్యలు తీరుతాయి.

– సిహెచ్.నారాయణరావు, ఆరిలోవ

హనుమంతవాక వద్ద ఫ్లైఓవర్ అవసరం



హనుమంతవాక కూడలిలో ఫ్లై ఓవర్ నిర్మాణం చాలా అవసరం. ఎప్పటి నుంచో ఈ ప్రతిపాదనలున్నాయి. ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మిస్తే ట్రాఫిక్ కష్టాలు తొలగి, రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట పడుతుంది. ఫ్లైఓవర్ నిర్మాణ ప్రతిపాదనను అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి. జాతీయ రహదారి, రద్దీ కూడలి కావడంతో ఇక్కడ ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించడం అత్యవసరం. అధికారులు దీనిపై దృష్టి పెట్టాలి.

– జి.ఎస్.ఎన్ రాజు, విశాలాక్షినగర్

క్రీడా రంగంలో అత్యుత్తమ ప్రతిభ చూపాలి



బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులను అభినందిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ చూపాలని వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ ఆకాంక్షించారు. మంగళవారం తన కార్యాలయంలో బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులను ఆయన అభినందించారు. బెంగళూరు యూనివర్సిటీలో ఇటీవల జరిగిన ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ మెన్స్ టోర్నమెంట్‌లో రన్నర్స్‌గా నిలిచిన ఏయూ క్రీడా జట్టును ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వీసీ రాజశేఖర్ మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండటం, పూర్తి సామర్థ్యాలను ప్రదర్శించడం ఎంతో ప్రధానమన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, క్రీడా విభాగం సంచాలకుడు ఆచార్య ఎన్.విజయమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలతో గుర్తింపు

నూతన ఆవిష్కరణలతో విద్యార్థులు, పరిశోధకులు, ఆచార్యులు ఆంధ్రా యూనివర్సిటీకి గుర్తింపు తీసుకురావాలని ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్ అన్నారు. ఇటీవల జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన నేషనల్ ఎక్సెలెన్స్ అవార్డును అందుకున్న ఎంఎస్సీ బయోటెక్నాలజీ, జువాలజీ విభాగం విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు పాల్గొన్నారు.

నేడు జాబ్ అచీవర్స్ డే

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో బుధవారం జాబ్ అచీవర్స్ డే నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కాలేజీ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో గాయత్రి విద్యా పరిషత్ సెక్రటరీ ప్రొఫెసర్ పి.సోమరాజు ముఖ్య అతిథిగా, వీఎంఆర్‌డీఏ చీఫ్ ఇంజినీర్ ఎం.వినయ్‌కుమార్ ప్రత్యేక అతిథిగా పాల్గొంటారని చెప్పారు.

క్షయపై అవగాహన ర్యాలీ



ఆరిలోవ కాలనీ యూపీహెచ్‌సీ వద్ద ర్యాలీ ప్రారంభిస్తున్న వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు

ఆరిలోవ: క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని బాలాజీనగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిరణ్ లలిత సూచించారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆరిలోవ ఆఖరి బస్ స్టాప్ వద్ద ఉన్న యూపీహెచ్‌సీ సిబ్బందితో కలసి ఆరిలోవ ఎఫ్ఆర్‌యూ, టీబీ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం నుంచి ఆరిలోవ కాలనీ వరకు ర్యాలీ చేశారు. అనంతరం అక్కడి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం కూడలిలో మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ లలిత మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం తగ్గకపోతే టీబీ లక్షణాలు కావచ్చని తెలిపారు. అలాంటివారు వెంటనే సమీప ఆస్పత్రిలో వైద్యులను సంప్రదించి, వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఎఫ్ఆర్‌యూ, యూపీహెచ్‌సీల్లో టీబీ యూనిట్ సిబ్బంది టీబీ పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీబీ యూనిట్, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

టూ టౌన్ సీఐకు సత్కారం



సీఐ ఎర్రం నాయుడిని సత్కరిస్తున్న వాకర్స్ సభ్యులు

ఆరిలోవ: కైలాసగిరి హెల్త్ ఎరీనా వాకర్స్ అసోసియేషన్, తెన్నేటి లాఫ్టర్ క్లబ్, బీఎస్ఎన్ఎల్ విశ్రాంతి ఉద్యోగుల ఆధ్వర్యంలో విశాలాక్షినగర్ జ్యోతి ఆర్కేడ్‌లో మంగళవారం టూ టౌన్ సీఐ ఎర్రం నాయుడికి అభినందన సభ నిర్వహించారు. కైలాసగిరి హెల్త్ ఎరీనా వాకర్స్ అసోసియేషన్‌లో సభ్యుడిగా ఉన్న ఆయన ఇటీవల పార్వతీపురం నుంచి బదిలీపై వచ్చి టూ టౌన్ పోలీస్ స్టేషన్ సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను ఆయా అసోసియేషన్ల సభ్యులు ఘనంగా సత్కరించారు. పోలీస్ ఉద్యోగంలో మరింత నిజాయితీగా సేవలందించాలని సభ్యులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సంఘం కార్యదర్శి జి.ఎస్.ఎన్.రాజు, తెన్నేటి లాఫ్టర్ క్లబ్ అధ్యక్షుడు కొమ్మిన సత్యనారాయణ, కైలాసగిరి హెల్త్ ఎరీనా వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కలిదిండి సుందర రామరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై చెత్త వేయకుండా ముగ్గులు



పాత ఆరిలోవలో రోడ్డుపై పారిశుధ్య సిబ్బంది వేసిన ముగ్గులు

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డులో పారిశుధ్య సిబ్బంది స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ విశాఖ కార్యక్రమం వినూత్నంగా చేపడుతున్నారు. బాలాజీనగర్, పాత ఆరిలోవ ప్రాంతాల్లో స్థానికులు రోడ్డు పక్కన చెత్త వేసే స్థలాల్లో పారిశుధ్య కార్మికులు ముగ్గులు వేస్తున్నారు. వాటి చుట్టూ పూల కుండీలు పెడుతున్నారు. ఆయా స్థలాల్లో చెత్త వేయవద్దంటూ అవగాహన కల్పిస్తున్నారు. స్థానికులు కొందరు ఇంట్లో తడి, పొడి చెత్తను రోడ్ల పక్కన వేసేస్తున్నారు. అటువంటి స్థలాల్లో వీరు ముగ్గులు వేసి వినూత్నంగా అవగాహన కల్పించడం విశేషం.

రీసైక్లింగ్ సంస్థలను ప్రోత్సహించండి



కళాశాల ఆవరణలో వనంగా అభివృద్ధి చేస్తున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆచార్య రెడ్డి తదితరులు

ఎంవీపీకాలనీ: రోజు వారి జీవితంలో వినియోగించే ఉత్పత్తులను రీసైక్లింగ్ చేసి అందుబాటులోకి తెస్తున్న సంస్థలను ప్రోత్సహించాలని ఏయూ పర్యావరణ విభాగం మాజీ ఆచార్యుడు ఇ.యు.బి.రెడ్డి కోరారు. గ్లోబల్ రీసైక్లింగ్ డేను పురస్కరించుకుని మంగళవారం ఎంవీపీ కాలనీలోని సమత కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రీసైక్లింగ్ ఉత్పత్తుల ద్వారా సమాజానికి కలిగే లబ్ధిని విద్యార్థులకు వివరించారు. రీసైక్లింగ్ ద్వారా సహజ వనరులను కాపాడటం, కార్బన్ ఉద్గారాలను తగ్గించడం ద్వారా భావితరాలకు పర్యావరణాన్ని సురక్షితంగా అందించడం సాధ్యమవుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణలో రీసైక్లింగ్ అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న మొక్కల పెంపకం, దేశీయ పండ్ల గింజలను ఆరబెట్టి వనంగా చల్లడం వంటి కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, గ్రీన్ క్లైమేట్ కార్యదర్శి జె.వి.రత్నం తదితరులు పాల్గొన్నారు.

అనధికార బడ్డీల తొలగింపులో నిర్లక్ష్యం

- టౌన్ ప్లానింగ్ సిబ్బంది తీరుపై విమర్శలు



ఎంవీపీ టీటీడీ కల్యాణ మండపం గేటును ఆనుకుని రాత్రి వేళ నిర్వహిస్తున్న టిఫిన్ బడ్డీ

ఎంవీపీకాలనీ: ఎంవీపీ సర్కిల్ టీటీడీ కల్యాణ మండపం ఎదుట అనధికారిక బడ్డీల తొలగింపులో జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం నిర్లక్ష్య ధోరణి సర్వత్రా విమర్శల పాలవుతోంది. ఇప్పటికే ఇక్కడ అనేక అనధికారిక బడ్డీలు ఉండగా.. టీటీడీ కల్యాణ మండపం గేటును, ఈ–దర్శనం గేటును ఆనుకొని మరికొన్ని దుకాణాలు తాజాగా ఏర్పాటు చేయడంతో మరింత అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. తాజాగా అక్కడ రాత్రి పూట టిఫిన్స్ సెంటర్లతో పాటు పకోడి బడ్డీల ఏర్పాటు ద్వారా విక్రయాలు ప్రారంభించారు. దీంతో టీటీడీ కల్యాణ మండపం, ఈ–కౌంటర్ భవనాల్లోకి వెళ్లేలంటే ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తి భక్తులకు విస్తుపోయే పరిస్థితులు నెలకొన్నాయి.

అందువల్లే జాప్యం..

కొంతకాలంగా ఇక్కడి అనధికార బడ్డీలను తొలగించాలనే డిమాండ్ ఉన్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులపై 17వ వార్డుకు చెందిన ఓ జనసేన నాయకుడి ఒత్తిళ్లే దీనికి కారణమని టౌన్ ప్లానింగ్ సిబ్బందే వెల్లడించడం తాజా చర్చనీయాంశంగా మారింది. టీటీడీ కల్యాణ మండపం గేటు పక్కన ఏర్పాటు చేసిన బడ్డీ తన అనుచరుడిదని, దానిపై చర్యలు తీసుకోవద్దని కొంతకాలంగా జోన్–3 టౌన్ ప్లానింగ్ అధికారులపై జనసేన నాయకుడు ఒత్తిడి చేస్తున్నట్లు చెబుతున్నారు. అందువల్లే చర్యలు తీసుకోవడంలో జాప్యం జరుగుతున్నట్లు సైతం అధికారులు వెల్లడిస్తున్నారు. టీటీడీ భవనాలకు ఇరువైపులా ఉన్న రెండు గేట్లు కనిపించకుండా మూసినట్లు ఏర్పాటు చేసిన ఆయా బడ్డీలను తొలగించకపోగా ఇతర వ్యాపారులకు ఇబ్బందులు సృష్టిస్తున్న వారితో టౌన్ ప్లానింగ్ ఉద్యోగులు లాలూచీ పడటం సరికాదంటూ ఇతర వ్యాపారులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ ప్రాంతంలో సమస్యాత్మకంగా మారిన ఆయా బడ్డీలను తొలగించాలని కోరుతున్నారు.

భవిత కేంద్రాల సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక

సీతంపేట: దివ్యాంగ పిల్లలను మానసిక, సామాజిక అభివృద్ధిలో ముందంజలో ఉంచేలా రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ సిఫార్సులు చేయనున్నట్టు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం తెలిపారు. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ ప్రాంగణంలోని భవిత కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. సిబ్బంది, అధికారులు, పిల్లల తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. ప్రత్యేక బోధన విధానాలతో తర్ఫీదు పొందిన ఉపాధ్యాయులు ఎంతమంది, వారెక్కడ శిక్షణ పొందారు, పిల్లలకు బ్రెయిలీ లిపి, సంజ్ఞా భాష, స్పీచ్ థెరపీ వంటి విద్యా విధానాలు ఎలా అమలు చేస్తున్నారు అనే విషయాలను సర్వశిక్షా అభియాన్ పథకం ఏపీసీ జె.చంద్రశేఖర్, జిల్లా కో ఆర్డినేటర్ బి.గీతలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ భవిత కేంద్రాల్లోని సమస్యలపై ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామన్నారు.

సింహగిరిపై ఘనంగా శ్రీనృసింహ హోమం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని మంగళవారం సింహగిరిపై శ్రీ నృసింహ హోమం ఘనంగా జరిగింది. ఉదయం 7 నుంచి ఆలయ కల్యాణమండపంలో అర్చకులు హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదికపై చక్రపెరుమాళ్లని కొలువుంచారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, షోడషోపచారపూజలు జరిపారు.

తీరమా.. డంపింగ్ యార్డా..







సాగర తీరాన్ని కొందరు డంపింగ్ యార్డుగా మార్చేస్తున్నారు. భవన నిర్మాణ వ్యర్థాలను తెచ్చి తీరంలో పడేస్తున్నారు. కోస్టల్ బ్యాటరీ సమీపంలోని సాగర తీరంలో వివిధ ప్రాంతాల నుంచి తెచ్చిన భవన నిర్మాణ వ్యర్థాలు, మద్యం సీసాలు, చెత్తాచెదారం పడేయడంతో దుర్గంధభరితంగా మారుతోంది. అదే విధంగా కాలువల నుంచి వస్తున్న వ్యర్థాలు కూడా అధికంగా తీరంలోకి చేరుతున్నాయి. అధికారులు ప్రత్యేక దృష్టిసారించి, వీటికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది.

- ఏయూ క్యాంపస్